


బాబా మందిర వార్షికోత్సవం

క్రోసూరు: షిర్డీ సాయిబాబా మందిర 25వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మందిరానికి లింగాల కళాధర్, పూర్ణిమ దంపతులు వెండి తాపడం అందించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 520.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 4,050 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల



నకరికల్లు: మండలంలోని చల్లగుండ్లలో శ్రీ ప్రసన్నాంజనేయస్వామి 33వ వార్షిక తిరునాళ్లను ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

న్యూస్‌రీల్

'కళారత్న' అందుకున్న డాక్టర్ బొర్రా గోవర్ధన్



నగరం: ఉగాది పురస్కారాలలో భాగంగా నగరం గ్రామానికి చెందిన ప్రముఖ బౌద్ధ, సైన్స్ రచయిత డాక్టర్ బొర్రా గోవర్ధన్ కళారత్న అవార్డును ఆదివారం సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. గోవర్ధన్ కళారత్న అవార్డును అందుకోవడంపై గ్రామ ప్రజలు, సన్నిహితులు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉగాది సాహితీ పురస్కారం అందుకున్న 'వడలి'



చీరాల అర్బన్: చీరాలకు చెందిన రచయిత, సాహితీవేత్త, సహజసాహితి వ్యవస్థాపక అధ్యక్షుడు వడలి రాధాకృష్ణ ఆదివారం ఉగాది పర్వదినాన రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ప్రముఖులు, కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.

శివ లింగాన్ని తాకిన సూర్య కిరణాలు



దాచేపల్లి : మండలంలోని గామాలపాడులో సుప్రసిద్ధ మహా శైవ క్షేత్రంలోని శివలింగాన్ని ఆదివారం సూర్య కిరణాలు తాకాయి. సూర్యోదయం అయిన తరువాత దేవాలయం తలుపులు తీయగానే నేరుగా గర్భగుడిలోని శివలింగంపై పడ్డాయి. దీంతో ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు తరలివచ్చి శివలింగాన్ని దర్శించుకుని, పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్సీ, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, సర్పంచ్ జంగా సురేష్ మహా శైవ క్షేత్రంలో పూజలు నిర్వహించారు. శివలింగాన్ని సూర్య కిరణాలు తాకడం అరుదైన ఘటన కావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

శాస్త్రోక్తంగా పంచాంగ శ్రవణం



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరునికి ఆదివారం వేకువజామున మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ఈవో సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో వెంకటాద్రినాయుడు మండపంలో స్వామిని ఉంచి, శ్రీ విశ్వావసు నామ సంవత్సర పంచాంగాలకు పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఈ సంవత్సరం ఆర్థిక, వ్యవసాయ, రాజకీయ రంగాల్లో జరిగే పరిణామాలను వివరించారు. అనంతరం భక్తులందరికీ ఉచితంగా పంచాంగాలను పంపిణీ చేశారు.

వేంకటేశ్వర స్వామికి కిరీటం బహూకరణ



గురజాల రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో గల శ్రీ వేంకటేశ్వరస్వామికి రూ.5లక్షల విలువైన బంగారు పూత కలిగిన వెండి కిరీటాన్ని నందేల పెద్ద సైదారెడ్డి, నాగమ్మ, చిన సైదారెడ్డి, కోటేశ్వరమ్మ ఆదివారం బహూకరించారు. కిరీటాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అర్చకులకు అందజేశారు.

విశ్వావసు వెలుగులు తేవాలి

- ఆకాంక్షించిన జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి
- బాపట్లలో ఘనంగా ఉగాది సంబరాలు
- పలువురికి ఉగాది పురస్కారాలు ప్రదానం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



పూజా కార్యక్రమాల్లో కలెక్టర్ జె.వెంకట మురళి, జేసీ ప్రఖర్ జైన్

బాపట్ల: శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ జిల్లా ప్రజల జీవితాల్లో వెలుగులు తేవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆకాంక్షించారు. ఆదివారం, జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురు గల ఏపీహెచ్ఆర్‌డీ సమావేశ మందిరంలో ఉగాది ఉత్సవాలు జరిగాయి. కలెక్టర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి వేంకటేశ్వరస్వామి చిత్రపటానికి పూజ చేసి, జ్యోతి వెలిగించి పంచాంగ శ్రవణం ప్రారంభించారు. వేద పండితులు జిల్లా కలెక్టర్, బాపట్ల ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జేసీలను ఆశీర్వదించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యక్రమానికి విచ్చేసిన అధికారులకు ప్రజాప్రతినిధులకు, జిల్లా ప్రజలకు శ్రీ విశ్వావసు నామ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం..

జిల్లా అభివృద్ధిలో చేపడుతున్న పలు కార్యక్రమాల గురించి జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి వివరించారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమయ్యాయన్నారు. నిజాంపట్నం ఫేజ్–2 విస్తరణ పనులు 63శాతం పూర్తయ్యాయని తెలిపారు. అటవీ శాఖకు సంబంధించిన భూముల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపి పరిష్కార మార్గం చూపామన్నారు. ఆ భూములను వారికి ఇవ్వటం వలన నిజాంపట్నం పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. కృష్ణానది కుడి కాలవ గట్టు జిల్లాలో 63 కిలోమీటర్లు మేర విస్తరించి ఉందని, ఆ గట్టును పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకు రూ.1540 కోట్లతో 15 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా కూడా తట్టుకునే విధంగా డీపీఆర్ తయారుచేసి ఇచ్చామన్నారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి ఒక డయాలసిస్ కేంద్రాన్ని మంజూరు చేయమని ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజు, ఎమ్మెల్సీ పోతుల సునీత, జేసీ ప్రఖర్ జైన్, డీఆర్‌ఓ గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్డీఓ గ్లోరియా పాల్గొని ప్రజలకు, అధికారులకు, విద్యార్థులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లాలోని వివిధ దేవాలయాల పూజారులకు, వివిధ రంగాల్లో ప్రముఖులకు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉగాది పురస్కారాలను జిల్లా కలెక్టర్, బాపట్ల ఎమ్మెల్యే, జాయింట్ కలెక్టర్లు అందించారు.



రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ జి.ఎస్.నారాయణభట్టుకు ఉగాది పురస్కారం



విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన



కొత్త గొల్లపాలెంలో పర్యటిస్తున్న కలెక్టర్ జె.వెంకట మురళి, ఎస్పీ తుషార్ డూడీ, జేసీ

చినగంజాం: రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. చినగంజాం మండలం కొత్త గొల్లపాలెం గ్రామానికి ఏప్రిల్ 1వ తేదీన సీఎం చంద్రబాబు నాయుడు విచ్చేయనున్న నేపథ్యంలో గ్రామంలో ఆదివారం కలెక్టర్, ఎస్పీ తుషార్ డూడీలు పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అధికారులకు కేటాయించిన బాధ్యతలను సోమవారం సాయంత్రంలోగా పూర్తి చేయాలన్నారు. సీఎం పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. ప్రజావేదిక వద్ద 2 వేల మంది ప్రజలు హాజరయ్యే విధంగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా మంచినీటిని సరఫరా చేయాలన్నారు. ఆయనవెంట జేసీ ప్రఖర్ జైన్, డీఆర్‌ఓ ప్రభాకర్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, డ్వామా పీడీ విజయలక్ష్మి, జిల్లా రవాణాశాఖాధికారి పరంధామరెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి మాధవ నాయుడు తదితరులు ఉన్నారు.

బంగారు గరుడోత్సవం



మంగళగిరి టౌన్: మంగళాద్రిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం ఉదయం ఉగాది తిరువంజనోత్సవంతోపాటు స్వామికి శాంతి కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం ఉగాది సందర్భంగా శనగల శేషాంజనేయ గోపాల్ పంచాంగ పఠనం చేశారు. సాయంత్రం 6 గంటలకు స్వామి బంగారు గరుడోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని తరించారు. అదాందల మహల్ పవళింపు సేవలో గులాబీ పువ్వులతో సహస్ర నామార్చన నిర్వహించారు. ఆలయ ఈఓ రామకోటి రెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. బంగారు గరుడోత్సవానికి కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన నందికంటి వెంకట హనుమాన్ ప్రసాద్ వ్యవహరించారు.

నేటి పీజీఆర్ఎస్ తాత్కాలికంగా రద్దు

జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల టౌన్: రంజాన్ పర్వదినం సందర్భంగా సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. రంజాన్ సందర్భంగా పండుగ సెలవుగా భావించాలని ఎస్పీ సూచించారు. కఠినమైన రంజాన్ ఉపవాసాలు ముగించుకుని 'ఈద్ ఉల్ ఫితర్' జరుపుకొనేందుకు సిద్ధమవుతున్న ముస్లింలకు ఆయన రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంతమైన, శాంతియుత వాతావరణంలో, సంతోషంగా జిల్లాలోని ముస్లింలంతా రంజాన్ పండుగ జరుపుకోవాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు.

సమగ్ర దర్యాప్తు జరిపించండి



చీరాల శాంతిర్యాలీలో భారీ సంఖ్యలో పాల్గొన్న క్రైస్తవులు

- పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి ఘటనలో నిజానిజాలు వెలికితీయాలి
- చీరాలలో క్రైస్తవ సంఘాల శాంతి ర్యాలీ

చీరాల రూరల్: అంతర్జాతీయ సువార్తికులు, పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని పలువురు క్రైస్తవులు, క్రైస్తవ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు చీరాలలోని క్రైస్తవులు, దళిత సంఘాలు, ఆయా సంఘాలకు చెందిన పాస్టర్ల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చి (పెద్దచర్చి) నుంచి పట్టణ పుర వీధుల్లో కొవ్వొత్తులతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ముందుగా పట్టణంలోని అన్ని క్రైస్తవ సంఘాలకు చెందిన క్రైస్తవులు, పాస్టర్లు చర్చివద్దకు చేరుకున్నారు. చర్చి నుంచి ప్రారంభమైన ర్యాలీ మసీదు సెంటర్ మీదుగా, బస్టాండ్ మీదుగా గడియార స్తంభం వద్దకు చేరుకుంది. ర్యాలీలో పాల్గొన్న వారంతా క్రైస్తవులపై దాడులు అరికట్టాలని, పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని నినాదాలు చేశారు. గడియార స్తంభం సెంటర్లో ఏర్పాటు చేసిన సభలో పాస్టర్లు రెవరెండ్ పిల్లి దేవదాసు, రెవరెండ్ నానిబాబు, రెవరెండ్ చంద్రకాంత్, రెవరెండ్ అనిల్‌ప్రభు, పాస్టర్ రాజేష్, చర్చి చైర్మన్ దేటా అశోక్‌కుమార్, దేటా దివాకర్, నీలం శామ్యూల్ మోజెస్‌లు మాట్లాడారు. పాస్టర్ ప్రవీణ్ మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని పోలీసు అధికారులు ఈ కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర దర్యాప్తు చేసి దోషులైన వారిని శిక్షించాలని హోప్ ఫెలోషిప్ అధ్యక్షుడు చింత యెషయా డిమాండ్ చేశారు. పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై కర్లపాలెంలో క్రైస్తవులు ఆదివారం ప్లకార్డులు చేతబట్టి శాంతియుత ర్యాలీ నిర్వహించి, కర్లపాలెం పోలీసులకు వినతిపత్రం అందజేశారు. పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పదంగా మృతిచెందటంపై రెండు తెలుగు రాష్ట్రాల్లోని క్రైస్తవులు మనోవేదనకు గురయ్యారని యెషయా తెలిపారు. పాస్టర్ బి.లాబానురాజు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాలను ఎవరైనా హత్య చేసి ఉంటారా అనే కోణంలో విచారణ జరిపి నిజానిజాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ యారం వనజ, ధనుంజయ్, పరమానందకుమార్, గిరిజన నాయకుడు నరసింహారావు, పాస్టర్లు పాల్గొన్నారు.



కర్లపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు, క్రైస్తవ సంఘాల నాయకులు

ఉగాది నాడూ బరి తెగించారు

- పర్చూరులో పండుగ సందర్భంగా జోరుగా కోడి పందేలు
- పలు జిల్లాల నుంచి వందల సంఖ్యలో వచ్చిన పందెం రాయుళ్లు
- టెంట్‌లు వేసి మరీ పందేల నిర్వహణ
- ఏలూరు, భీమవరం బరులకు ఏ మాత్రం తీసిపోని సెట్టింగులు
- రూ.లక్షల్లో చేతులు మారిన పైనం
- ఫొటోలు, వీడియోలు తీయకుండా పలు ఆంక్షలు
- సమాచారం ఇచ్చినా కదలని పోలీసు యంత్రాంగం



పర్చూరులో బరులు వేసి కోడి పందేలు నిర్వహిస్తున్న దృశ్యం

పర్చూరు(చినగంజాం): ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం పర్చూరులో పెద్ద ఎత్తున కోడి పందేలను నిర్వహించారు. నాగులపాలెం శివారు పొలాల్లోని పెద్ద కాలువ వద్ద కోడి పందేలకోసం బరులను, భారీ ఎత్తున టెంట్‌లు, మైక్ సెట్టింగ్‌లను సైతం ఏర్పాటు వేసి పందేలను నిర్వహించారు. ముందుగానే సమాచారం ఉండటంతో చుట్టు పక్కల జిల్లాలనుంచి పందెం రాయుళ్లు సుమారు 300 మందికి పైగా తరలి వచ్చారు. నెలల తరబడి జీడిపప్పు, బాదం పప్పు, పిస్తా పప్పు లాంటి ఖరీదైన ఆహారంతో పెంచిన కోడి పుంజులను తీసుకొచ్చి తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. కోడికి కత్తి కట్టేందుకు నిపుణులను కూడా తమ వెంట తెచ్చుకున్నారు. ఒకటికి పది, పదికి యాభై, అంటూ డబ్బు కట్టలు ఊపుతూ నిర్వాహకులు మైకులో హోరెత్తించారు.

గోదావరి జిల్లాల మాదిరిగానే..

ఈ కోడి పందేల్లో రూ.లక్షల్లో చేతులు మారాయి. గత అర్థరాత్రి నుంచి బారికేడ్లు, టెంట్‌లు వేసి అంతా సిద్ధం చేశారు. మద్యం సౌకర్యం కూడా ఏర్పాటు చేసినట్లు సమాచారం. మీడియా వారిని దరిచేరకుండా పలురకాల ఆంక్షలు పెట్టారు. బరి దగ్గరకు వెళ్లే అన్ని మార్గాల్లో నిర్వాహకులు తమ మనుషులను పెట్టి అనుమానితులను క్షుణ్ణంగా తనిఖీలు చేసి లోపలకు అనుమతించారు. ప్రేక్షకులు వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లను కూడా లాక్కొని స్విచ్ ఆఫ్ చేయించారు. పర్చూరు ప్రాంతంలో ఇంత భారీ ఎత్తున నిషేధిత కోడి పందేలను నిర్వహించడం ఇదే తొలిసారి అని ఇలాంటి సెట్టింగులను చూసి అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. టెంట్‌లను వేసి మైకుల్లో అనౌన్స్ చేస్తూ పందేలను నిర్వహిస్తున్నారంటే ముందుగానే పోలీసు అధికారులందరికీ సమాచారం అందజేసి ఉంటారని పలువురు గుసగుసలాడుకుంటున్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఆచారం పర్చూరుకు కూడా పాకిందంటూ పలువురు విమర్శిస్తున్నారు.




భారీగా వేసిన సెట్టింగులు

సమాచారం ఇచ్చినా స్పందించని పైనం

కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారాన్ని కొందరు స్థానిక పోలీసులకు అందించినా వారిలో చలనం లేదని మండి పడుతున్నారు. కోడి పందేల నిర్వాహకులు ముందే పోలీసులతో ఒప్పందం చేసుకున్నారని లేకుంటే ఇంత భారీ ఎత్తున పందేలు నిర్వహించడం సాధ్యం కాదని కొందరు బహిరంగంగానే చర్చించుకున్నారు. కొందరు ప్రజాప్రతినిధులు, స్థానిక అధికార పార్టీ నాయకుల ఆదేశాలతో, అధికారుల కనుసన్నల్లోనే బరులు ఏర్పాటు చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపికలు



ఎంపికైన క్రీడాకారులు

అచ్చంపేట: స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో పల్నాడు జిల్లా రెజ్లింగ్ అమెచ్యూర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అండర్– 20, అండర్ –15 విభాగాల్లో బాలబాలికలకు రెజ్లింగ్ పోటీలు నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా రెజ్లింగ్ అమెచ్యూర్ అసోసియేషన్ కార్యదర్శి గుడిపూడి భూషణం మాట్లాడుతూ ఏప్రిల్ 4,5,6 తేదీల్లో రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. పోటీలను అసోసియేషన్ చైర్మన్ వై.రమేష్‌బాబు ప్రారంభించారు.

ఎంపికైన బాలబాలికలు

- అండర్ 15 బాలికల విభాగంలో సాగార్జునసాగర్‌కు చెందిన ఎస్.లావణ్య, బి.అలేఖ్య, ఎం.పూజిత, ఎ.పూజిత, ఎస్.మేరి, డి.శృతి, జి.గాయత్రి
- అండర్ 15 బాలుర విభాగంలో అచ్చంపేటకు చెందిన పి.నాగచైతన్య, ఒ.గౌరి ప్రతాప్, సీహెచ్. రాంబాబు, ఎ.ప్రణీత్, అడవితక్కెళ్లపాడుకు చెందిన కె.ఆదిత్య, వి.పవన్‌కుమార్, కె.అంకిత్‌రెడ్డి, దుగ్గిరాలకు చెందిన అనంద్ భానుప్రసాద్
- అండర్ 20 బాలికల విభాగంలో నాగార్జునసాగర్‌కు చెందిన ఆర్.గాయత్రి బాయి, ఎం.దీపిక భువన, వినుకొండకు చెందిన కె.భ్యూలా, బ్రాహ్మణకోడూరుకు చెందిన డి.నెహశ్రీ
- అండర్ 20 బాలుర విభాగంలో కె.బాలు నాయక్(రామకృష్ణాపురం), ఎస్.శ్రీకర ప్రసాద్(గోరింట్ల), పి.సుమంత్(ఆవులవారిపాలెం), ఎ.సి.బాల కోటేశ్వరరావు (పిడుగురాళ్ల) బి.విజయ్‌బాబు (కాజ), కె.కిరణ్(చల్లగరిగ), డి.కుమార్ (లగడపాడు) పి.చంటి(బాలేమర్రు), కె.భరత్‌కుమార్(రావిపాడు), డి.కళ్యాణ్ (గోళ్లపాడు) కె.ప్రభాకర్ (ఓబులేసుపల్లి)ఎం.అఖిల్ (పిడుగురాళ్ల).

క్లుప్తంగా

ఉగాది పురస్కారం అందుకున్న పుట్టంరాజు



అద్దంకి: మండలంలోని తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన సాహితీవేత్త పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి ఆదివారం సీఎం చంద్రబాబునాయుడు చేతులమీదుగా ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. ఈ పురస్కారాన్ని ఆయనకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సాహిత్యవిభాగంలో అందించిన సేవలకు గాను సీఎం అందజేశారు. ఇప్పటికే 11 పుస్తకాలు, రెండు సంకలన గ్రంథాలు రచించడంతోపాటు, ఇరవైకి పైగా పురస్కారాలను ఈయన అందుకున్నారు. పుట్టంరాజుకు ఈ గౌరవం దక్కడంపై సినీ విమర్శకుడు వారణాశి రఘురామశర్మ, విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌రావు, సాహితీవేత్త గాడేపల్లి దివాకరదత్తు, రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కేవీపీ రెడ్డి, చుండూరి మరళీ సుధాకరరావు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు అభినందనలు తెలిపారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం



చీరాల: ఆహార ప్రాసెసింగ్ రంగంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధి, బ్రాండింగ్, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు మద్దతు ఇస్తూ ప్రభుత్వం మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహాన్ని అందిస్తోందని చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ ద్వారా రూ.13లక్షల చెక్కును యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు గాను చిల్లర ఆదిలక్ష్మి అనే మహిళకు ఎమ్మెల్యే అందించారు. స్వశక్తితో నిలబడాలనుకునేవారికి పీఎంఈజీపీ పథకం ద్వారా ఒక లక్ష నుంచి రూ.50లక్షల వరకు రుణాన్ని 35శాతం వరకు రాయితీతో ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఈ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లి స్వయం శక్తితో నిలబడాలనుకునే యువతను ప్రోత్సహించాలని ఏపీఎంను కోరారు. పినాకిని గ్రామీణ బ్యాంకు మేనేజర్ సుభాషిణి, చీరాల ఏపీఎం మధుసూదనరావు, వేటపాలెం ఏపీఎం ఫణిబాబు ఉన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

జెడ్పీటీసీ సభ్యురాలిని పరామర్శించిన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

కారంచేడు: అధైర్య పడకమ్మా..! అండగా నేనున్నా.. అంటూ ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ జెడ్పీటీసీ సభ్యురాలికి ధైర్యమిచ్చారు. అనారోగ్య సమస్యలతో గత కొన్ని నెలలుగా హైదరాబాద్‌లో చికిత్స పొంది స్వగ్రామమైన కారంచేడుకు వచ్చిన కారంచేడు జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీ శ్రీనివాసరావును ఆదివారం సాయంత్రం జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శించి ధైర్యం చెప్పారు. అందుతున్న చికిత్స వివరాలు, అడిగి తెలుసుకుని, తాము అన్నివిధాలా ఉండాగా ఉంటామని భరోసా ఇచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ వెంట దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూధనరెడ్డి, చినగంజాం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మారెడ్డి, భవనం శ్రీనివాసరెడ్డి, గుంటక తిరుపతిరెడ్డి, పార్టీ మార్టూరు, పర్చూరు మండలాల కన్వీనర్లు జంపని వీరయ్య, కటారి చిన అప్పారావు, కారంచేడు మాజీ కన్వీనర్ దండా చౌదరిబాబు, మండల కో–ఆప్షన్ సభ్యుడు ముల్లా నూర్ అహ్మద్, మార్టూరు రవిచంద్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి బిల్లాలి డేవిడ్ స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



కారంచేడు జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

గోవింద నామస్మరణతో మార్మోగిన నేతి వెంకన్న ఆలయం



తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు

రాజుపాలెం: ఉగాది పండుగను పురస్కరించుకుని పల్నాడు తిరుపతిగా పేరుగాంచిన దేవరంపాడు కొండకు ఆదివారం భక్తులు పోటెత్తారు. కొండపై స్వయంభువుగా వెలసిన నేతి వెంకన్నస్వామిని దర్శించుకునేందుకు బారులుతీరారు. సమీప గ్రామాల నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు దేవరంపాడు కొండకు వచ్చారు. స్వామిని దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. గోవింద నామస్మరణతో కొండ మారుమోగింది. కోనేటి రాయుడికి కోటి దండాలంటూ నీరాజనాలు పలికారు. పొంగళ్లు చేసి, నెయ్యి, బెల్లం, పప్పును స్వామికి భక్తులు సమర్పించారు. పశు సంపదను కాపాడాలని నెయ్యిని సమర్పించి మొక్కుకున్నారు. అంచులవారిపాలెం మహిళల కోలాటం చూపరులను ఆకట్టుకుంది. తిరునాళ్లలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దాతలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

తెలుగు భాషా వైభవాన్ని ముందుతరాలకు అందించాలి



ప్రసంగిస్తున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్



హాజరైన వారు

ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): తెలుగు భాషా వైభవాన్ని ముందు తరాలకు అప్పగించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ అన్నారు. ఉగాది పండగ సందర్భంగా సాహితీ సమాఖ్య, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ సంయుక్తంగా మార్కెట్ కూడలిలోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం సాయంత్రం సాహితీ వసంతోత్సవం నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ డీవీఎస్‌టీ రామమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలను మండల స్థాయిల్లోనూ నిర్వహించాలని చెప్పారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ.కృష్ణబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని అన్నారు. పీ–4 మంచి కార్యక్రమం అని, ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని చెప్పారు. సంగీత విద్వన్మణి ఆర్.సూర్యలక్ష్మీ శిష్య బృందంతో విష్ణు సహస్రనామ పారాయణం చేయగా, గుదిమెళ్ల శ్రీ కూర్మనాథస్వామి పంచాంగ శ్రవణం చేపట్టారు. అనంతరం సాహితీ సమ్మేళనంలో సుప్రసిద్ధ సినీ గేయ, గజల్ రచయిత రసరాజు, సుప్రసిద్ధ సినీ నటులు కేదార్ శంకర్, హాస్య రచయిత డాక్టర్ పీవీ రామ్‌కుమార్, సంభాషణ రచయిత కె.కృష్ణవేణి, అష్టావధాని సల్లాన్ చక్రవర్తుల సాహిత్ పాల్గొన్నారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్‌వీఎస్.లక్ష్మీనారాయణ, కార్యదర్శి ఆర్.రాము, టీఎంటీ ట్రస్ట్ కార్యదర్శి పి.రామచంద్రరాజు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుతో తీవ్ర అన్యాయం

- బిల్లును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలి
- వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షురాలు నసీరున్నీసా బేగం



మాట్లాడుతున్న నసీరున్నీసా బేగం

రేపల్లె రూరల్: వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఈ బిల్లును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షురాలు నసీరున్నీసా బేగం కోరారు. పట్టణంలోని తన చాంబర్‌లో ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ముస్లింల హక్కులు, స్వేచ్ఛను కాలరాయటానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతూ వక్ఫ్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడుతోందన్నారు. బిల్లు ఆమోదం పొందితే దేశవ్యాప్తంగా ఉన్న ముస్లిం సమాజం తీవ్రంగా నష్టపోతుందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించటం బాధాకరమన్నారు. సమస్య ముస్లిం సమాజందే కాకుండా దేశ సమస్యగా ప్రతి ఒక్కరూ భావించి బిల్లు సవరణను అడ్డుకోవాలని ఆమె కోరారు. బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందితే ముస్లింల భావితరం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డుకు సంబంధించిన ఆస్తులపై ప్రైవేటు సంస్థలకు, ప్రభుత్వాలకు ఎటువంటి అధికారం ఉండదని, ఆస్తులపై అధికారం చేజిక్కించుకోవాలనే కుట్రతో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. భవిష్యత్‌లో ముస్లింల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ముస్లిం పెద్దలు వక్ఫ్ బోర్డు ద్వారా పలు ఆస్తులను ఏర్పరిచారని, వాటిని స్వాధీనం చేసుకోవాలన్న కుట్రతో బిల్లును తెరపైకి తెచ్చారన్నారు. ప్రతి ఒక్కరూ బిల్లును వ్యతిరేకించాలని కోరారు.

సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌పై కత్తితో దాడి

స్థలం వివాదంలో ఘర్షణే కారణం

చీరాల: సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌పై అదే గ్రామానికి చెందిన వారు కత్తితో దాడి చేసి గాయపరిచిన సంఘటన ఆదివారం చీరాల మండలం గవినివారిపాలెంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గవినివారిపాలెంకు చెందిన చీదరబోయిన నాగేశ్వరరావు సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. బంధువులతో కొంత కాలంగా స్థల వివాదం చోటుచేసుకోగా ఘర్షణ జరిగింది. చీదరబోయిన వీరయ్య, భరత్‌కుమార్, లక్ష్మీనారాయణ మరికొందరు కలిసి కానిస్టేబుల్‌పై కత్తితో దాడి చేసి గాయపరిచారు. చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాడేపల్లి క్రీడాకారుడికి స్కేటింగ్‌లో పతకాలు



మెడల్స్‌తో హాశిష్

తాడేపల్లి రూరల్: ఈనెల 24 నుంచి 30 వరకు తైవాన్‌లో జరిగిన అంతర్జాతీయ స్కేటింగ్ పోటీల్లో తాడేపల్లి డోలాస్‌నగర్‌కు చెందిన మెరుగుపాల హాశిష్ సత్తాచాటాడు. చైనీస్ తైపె రోలర్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో హాశిష్ ఆర్టిస్ట్ స్కేటింగ్ విభాగంలో ఫ్రీ స్టైల్, ఇన్‌లైన్, సోలో డ్యాన్స్ పోటీల్లో తలపడగా మూడు విభాగాల్లో రెండవ స్థానంలో నిలిచి మూడు రజిత పతకాలు సాధించాడు. తమిళనాడు కోలాచీలో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గత ఏడాది డిసెంబర్‌లో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లోనూ హాశిష్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. కోచ్ పి.సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ రోలర్స్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి పి.థామస్, గుంటూరు రోలర్‌స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నీలిమ, శ్రీకాంత్ హాశిష్‌కు అభినందనలు తెలిపారు.

హాకీ జూనియర్ పురుషుల జట్టు ఎంపిక

బాపట్ల: హాకీ జూనియర్ పురుషుల క్రీడాకారుల ఎంపిక ఆదివారం స్థానిక చెరువు జమ్ములపాలెంలో జరిగినట్లు హాకీ జిల్లా కార్యదర్శి బోయిన రవిచంద్ర తెలిపారు. పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఏప్రిల్ 6 నుంచి 9వరకు స్థానిక ధర్మవరంలో జరిగే జూనియర్ పురుషుల రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారుల్లో మేక శరత్ చంద్ర, యాజలి శరత్ బాబు, కటికల సాగర్ బాబు, గరికపాటి గమనియోల్, షేక్ సోహెల్, ఎస్కే అక్రమ్, మేరుగా సిసింద్రీ, నర్రారా నరేష్, ముక్కు తేజ సతీష్, బోయిన కిరణ్, కొమ్మూరి ఆకాష్, తైదుల మహేష్ బాబు, ఉసా హేమంత్, జొన్నలగడ్డ పీటర్ పాల్, జొన్నలగడ్డ ప్రవీణ్, ఎ.మణికంఠలు ఉన్నారు. గ్రామపెద్దలు పువ్వాడ బసంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

1, 2 తేదీల్లో జాతీయస్థాయి నాటకోత్సవాలు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన డీఎల్ కాంతారావు

తెనాలి: పట్టణానికి చెందిన డీఎల్ కాంతారావు పోస్టల్ ఉద్యోగుల కళాపరిషత్ ఆధ్వర్యంలో 14వ జాతీయస్థాయి నాటకోత్సవాలు ఏప్రిల్ 1, 2 తేదీల్లో నిర్వహించనున్నారు. కళాపరిషత్ వ్యవస్థాపకుడు డీఎల్ కాంతారావు, ప్రధాన కార్యదర్శి పీఎస్సార్ బ్రహ్మాచార్యులు ఆదివారం విలేకరుల సమావేశంలో నాటకోత్సవాల ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. వివరాలను తెలియజేశారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఒకటో తేదీ సాయంత్రం 6.30 గంటలకు నాటకోత్సవాల ప్రారంభసభకు కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు, ప్రముఖ రంగస్థల, టీవీ, సినీ నటుడు నాయుడు గోపి అధ్యక్షత వహిస్తారు. విశాఖపట్నంకు చెందిన ప్రముఖ నటి, రచయిత్రి, దర్శకురాలు కె.విజయలక్ష్మికి నందమూరి తారక రామారావు లైఫ్‌టైం ఎచీవ్‌మెంట్ అవార్డును ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేతులమీదుగా బహూకరిస్తారు. అనంతరం రాత్రి ఏడు గంటలకు సిరిమువ్వ కల్చరల్స్, హైదరాబాద్ వారి 'జేబు చెప్పిన ఊసులు' సాంఘిక నాటకాన్ని ప్రదర్శిస్తారు. స్నిగ్ధ రచించిన ఈ నాటకానికి మంజునాథ దర్శకత్వం వహిస్తారు. 2వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు డీఎల్ కాంతారావు పోస్టల్ ఉద్యోగుల కళాపరిషత్, తెనాలి వారిచే 'ది లెసన్' సాంఘిక నాటక ప్రదర్శన ఉంటుంది. స్నిగ్ధ రచించిన ఈ నాటికను పీఎస్సార్ బ్రహ్మాచార్యులు దర్శకత్వంలో ప్రదర్శిస్తారు. రాత్రి 7.30 గంటలకు శ్రీసాయి కళానికేతన్ వెల్ఫేర్ సొసైటీ, విశాఖపట్నం వారి పౌరాణిక పద్యనాటకం 'శశిరేఖా పరిణయం' (మాయాబజార్) ప్రదర్శిస్తారు. విద్వాన్ కన్నశ్రీ రచించిన ఈ నాటకానికి బీవీఏ నాయుడు దర్శకత్వం వహిస్తారు.

ఎన్జీటీ కాన్ఫరెన్సులో పాల్గొన్న జిల్లా ప్రతినిధులు



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రతినిధులతో చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య, సభ్యుడు ఆచార్య పీజే రత్నాకర్

ఏఎన్‌యూ(గుంటూరు): నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ) ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జరిగిన నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జియాలజీ విభాగాధిపతి, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఆచార్య పొన్నెకంటి జోసఫ్ రత్నాకర్ పాల్గొన్నారు. న్యూఢిల్లీలోని విగ్యాన్ భవన్‌లో ఈనెల 29, 30 తేదీలలో జరిగిన 'నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎన్విరాన్‌మెంట్– 2025'లో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ డాక్టర్ పి కృష్ణయ్యతో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రతినిధిగా పాల్గొన్నారు. ఈ సదస్సును ఈనెల 29న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించగా 30వ తేదీ సాయంత్రం జరిగిన ముగింపు సభకు ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెండు రోజులపాటు జరిగిన ఈ కాన్ఫరెన్స్‌లో ప్రస్తుతం పర్యావరణం ఎదుర్కొంటున్న సవాళ్ళు, పర్యావరణ నిర్వహణలో ఉత్తమ పద్ధతుల అనుసరణ, పర్యావరణ పరిరక్షణలో పలు విభాగాల భాగస్వామ్యం, సుస్థిర పర్యావరణ నిర్వహణకోసం భవిష్యత్ ప్రణాళిక రూపకల్పన తదితర అంశాలపై దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల ప్రతినిధులు హాజరై చర్చించారు. వారి అభిప్రాయాలను తెలియజేసి నివేదికల రూపంలో అందజేశారు. ఈ సదస్సులో కేంద్ర పర్యావరణ, అటవీ శాఖా మంత్రి భూపేంద్ర యాదవ్, ఎన్జీటీ చైర్మెన్ జస్టిస్ ప్రకాష్ శ్రీవాస్తవ, భారత అటార్నీ జనరల్ ఆర్ వెంకటరామణి, సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం ఏర్పాటుపై నిరసన



దుకాణం ఏర్పాటును నిరసిస్తున్న స్థానికులు

తెనాలిరూరల్: స్థానిక ముత్తెంశెట్టిపాలెంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడంపై స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. ముత్తెంశెట్టిపాలెం ప్రధాన సెంటరు వద్ద మద్యం దుకాణాన్ని ఆదివారం ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీ ద్వారా పాత రత్నా టాకీసు వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని ముత్తెంశెట్టిపాలెంకు తరలించారు. ఆదివారం దుకాణాన్ని తెరవడంతో స్థానికులు వ్యతిరేకించారు. ఇళ్ల మధ్య మద్యం దుకాణాలు వద్దని ఆక్షేపించారు. మహిళలు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు నిరసన కొనసాగించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకున్నారు. రోడ్డుపై నిరసన తెలుపడం సరికాదని, సంబంధిత ఎక్సైజ్ అధికారులను, మున్సిపల్ కమిషనర్‌ను కలిసి తమ అభ్యంతరాన్ని తెలియజేయాలని సూచించారు. స్థానికులు మాత్రం ఇళ్ల మధ్యలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేసేందుకు అంగీకరించేది లేదని స్పష్టం చేస్తున్నారు.

ఉల్లాసంగా ఎడ్ల పందేలు



ప్రథమ బహుమతి గెలుచుకున్న ఎడ్ల జత యజమానికి బహుమతి అందజేస్తున్న బుర్రా సాయిమాధవ్



నాలుగు పళ్ల విభాగంలో పోటీపడుతున్న ఎడ్ల జత

తెనాలిరూరల్: తెనాలి మార్కెట్ యార్డు ఆవరణలో జరుగుతున్న ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు రెండోరోజుకు చేరుకున్నాయి. వారం రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి. రెండోరోజు ఉత్సాహంగా పందేలు సాగాయి. తెనాలి, పరిసర ప్రాంతాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తొలిరోజు శనివారం రాత్రి జరిగిన రెండు పళ్ల విభాగం పోటీల్లో నంద్యాల జిల్లా గడివేములకు చెందిన పెరుమాళ్ల సంజయ్‌కుమార్ ఎడ్ల జత నిర్ణీత సమయంలో 3592.01 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. ఈ జత యజమానికి సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ బహుమతిని అందజేశారు.

నాలుగు పళ్ల విభాగంలో..

రెండోరోజు నాలుగు పళ్ల విభాగం పోటీలు ఆదివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఈ విభాగంలో మొత్తం 14 జతల ఎడ్లు పోటీకి దిగాయి. రాత్రి ఎనిమిది గంటల వరకు జరిగిన పోటీల్లో బాపట్ల జిల్లా జే పంగలూరుకు చెందిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ యూత్ ఎడ్ల జత ముందంజలో ఉన్నాయి. పోటీలు రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగాయి. రిఫరీగా సూరపనేని రాధాకృష్ణ వ్యవహరించారు.

హత్య కేసులో ముగ్గురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న నార్త్‌జోన్ డీఎస్పీ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కేఎల్ రావు కాలనీలో గుర్తు తెలియని వ్యక్తిని కొట్టి చంపిన కేసులో తాడేపల్లి పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేసి ఆదివారం కోర్టుకు హాజరుపరిచారు. నార్త్‌జోన్ డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు సీఐ కల్యాణ్‌రాజు నేతృత్వంలో నిందితులను అరెస్ట్ చేశామని తెలిపారు. డీఎస్పీ కథనం ప్రకారం.. ఈనెల 27న గుర్తుతెలియని సుమారు 30 ఏళ్ల వయస్సు ఉన్న ఓ వ్యక్తి కేఎల్‌రావు కాలనీలోని హోసన్న ప్రార్థనా మందిరం వద్ద దుర్గాశి రాజేశ్వరి ఇంట్లోకి దూరి ఆమెపై అఘాయిత్యం చేయడానికి యత్నించాడు. రాజేశ్వరి బిగ్గరగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న వల్లభాపురం జశ్వంత్, వల్లభాపురం కోటేశ్వరరావు, బోజంగి సింహాచలం నాయుడు మరో ముగ్గురు ఆ వ్యక్తిని పట్టుకునేందుకు యత్నించారు. అయితే ఆ వ్యక్తి కొండపైకి పారిపోయాడు. దీంతో అతడిని వెంబడించి పట్టుకుని పిడిగుద్దులు కురిపించడంతో మరణించాడు. ఆ తర్వాత ఆ వ్యక్తిని రోడ్డుపైకి తీసుకొచ్చి పడేసి పారిపోయారు. దీనిపై కేసు నమోదు చేసిన తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు ఎస్ఐ జె.శ్రీనివాసరావుతో కలిసి దర్యాప్తు చేశారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద తిరుగుతున్న వల్లభాపురం జశ్వంత్, వల్లభాపురం కోటేశ్వరరావు, బోజంగి సింహాచలం నాయుడును అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ హత్యలో పాలుపంచుకున్న మరో ముగ్గురు మైనర్లు అని తేలింది. వారినీ త్వరలోనే అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు. అయితే చనిపోయిన వ్యక్తి ఎవరనేది ఇంకా నిర్ధారణ కాలేదు.

రూ.30 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ



ఉపకార వేతనాలను పంపిణీ చేస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, తులసి రామచంద్ర ప్రభు

కొరిటెపాడు(గుంటూరు): కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ ఆధ్వర్యంలో తులసి సీడ్స్ సహకారంతో 570 మంది పేద విద్యార్థులకు ఆదివారం రూ.30 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. స్థానికంగా ఉన్న ఓ కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ తాను పదో తరగతిలో ఉండగా కేవలం రూ.16 ఫీజు కట్టలేని గడ్డు పరిస్థితి ఎదుర్కొన్నానని గుర్తుచేసుకున్నారు. బీటెక్ ఇంటర్ చదివే రోజుల్లో ప్రభుత్వ ఉపకార వేతనం రూ.450 అందేదని చెప్పారు. జీవితంలో స్థిరపడ్డాక 1995–96లో ఇద్దరు విద్యార్థులకు ఉపకార వేతనం ఇవ్వడం మొదలు పెట్టానని, ఇప్పుడు 36వేల మందికి రూ.22 కోట్లు ఉపకార వేతనంగా అందిస్తున్నానని వివరించారు. కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ ట్రస్టు ద్వారా వీటిని పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ వితరణలో సింహభాగం తులసి సీడ్స్ సమకూరుస్తుందని వివరించారు.

తులసి ప్రభు అభినందనీయులు

కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్‌ల శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉపకారవేతనాలు అందించడం అభినందనీయమని తులసి రామచంద్ర ప్రభును ప్రశంసించారు. గుంటూరు సర్వజనాస్పత్రికి, మెడికల్ కళాశాలకు బస్సుల కోసం రూ.10 కోట్లు విరాళంగా ఇవ్వడం చాల గొప్ప విషయమని ప్రభుని అభినందించారు. అనంతరం 570 మంది విద్యార్థులకు రూ.30 లక్షల మేర ఉపకారవేతనాలను చెక్కుల రూపంలో అందించారు. కార్యక్రమంలో కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ – అండర్ ప్రివిలేజ్ ట్రస్ట్ ట్రస్టీలు తులసి యోగీష్ చంద్ర, తులసి కృష్ణ చైతన్య, నారదాసు శ్రీహరిరావు, మలిశెట్టి సుబ్బారావు, ఉగ్గిరాల సీతారామయ్య, తోట శంకరరావు, తిమ్మిశెట్టి నారాయణరావు , చందనం శ్రీనివాస్ , పసుపులేటి రమణయ్య, అంకిరెడ్డి సాంబశివరావు , నారదాసు కోటేశ్వరరావు , జంగాల సాంబశివరావు , మేకల రవీంద్ర, పుచ్చకాయలు ఆనంద్, కె.నరేంద్రనాథ్ , దళవాయి సుబ్రహ్మణ్యం , మిరియాల శ్రీనివాస్ , పంతంగి జనార్దనరావు , తులసి ఆదిత్య చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నసీర్ అహ్మద్‌కు ఉగాది పురస్కారం

పిడుగురాళ్ల: పట్టణానికి చెందిన చరిత్రకారుడు సయ్యద్ నసీర్ అహ్మద్ కళారత్న ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. విజయవాడలోని తుమ్మపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన ఉగాది సంబరాల్లో ఆయనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పురస్కారాన్ని అందజేశారు.ఈ సందర్భంగా తాను రచించిన 'భారత స్వాతంత్ర్య ఉద్యమం.. ఆంధ్ర ముస్లిం యోధులు' పుస్తకాన్ని చంద్రబాబుకు నసీర్ అహ్మద్ అందజేశారు.